క్లుప్తంగా

పోలీస్ ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న హెచ్ఏసీ కమాండెంట్ రామకృష్ణ, అధికారులు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలోగల మూడో బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీస్ ఆఫీసర్ అసోసియేషన్ డైరీని హెచ్ఏసీ కమాండెంట్ సీవీఏ రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానంద రావు, అసిస్టెంట్ కమాండెంట్ బి.చంద్రశేఖర్, అసిస్టెంట్ కమాండెంట్ మన్మధరావు, ఆర్ఐలు రవిశంకర్, రాము, అజయ్ కుమార్, ప్రసాద్, ట్రైనీ డీఎస్పీలు, అసోసియేషన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



గొర్రిపూడి ఎత్తిపోతల పథకం వద్ద అమరుస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

కరప: రైతులు వినతి మేరకు కలెక్టర్ షన్మోహన్ రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయించారు. మండలం గొర్రిపూడిలోని శ్రీరాజశేఖర పరస్పర సహకార ఎత్తిపోతల పథకం వద్ద ఉండే రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అపహరణకు గురికావడంతో ఆరు గ్రామాలకు చెందిన 4,800 ఎకరాలకు సాగునీరందని పరిస్థితి ఏర్పడింది. గొర్రిపూడి నీటిసంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు వినతి మేరకు కలెక్టర్ ఆదేశాలతో అధికారుల నివేదిక అనుసరించి బుధవారం ఈ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చి వెళ్లారు. గురువారం నుంచి సాగునీటిని సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈశ్వర్‌కుమార్

కాకినాడ సిటీ: చేనేత సామాజిక వర్గాలకు పూర్తి సహకారం అందిస్తానని, అందరూ సమష్టిగా ముందుకు వెళ్లాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం చేనేత సహకార సంఘాల ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన పప్పు దుర్గా రమేష్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను చేనేత సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేనేత సంఘాల ప్రతినిధులు ఇమంది చంద్రరావు, నక్కిన విజయలక్ష్మి, గుడిమెటల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ సమక్షంలో లెక్కించారు. 98 రోజుల వ్యవధికి రూ.10.89 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సత్యవాణి తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నగరానికి పన్ను పోటు!

- ఖాళీ స్థలాలకు యజమానులు ఎవరో!
- సర్వే పనిలో అధికారులు బిజీ
- వీఎల్‌టీ వసూళ్ల దిశగా ప్రణాళిక
- రూ.19 కోట్లకు పేరుకుపోయిన వైనం



నగరపాలక సంస్థ కార్యాలయం

కాకినాడ: ఖాళీ స్థలాల పన్ను చెల్లించకుండా ఎగవేసిన మొండి బకాయిదారులను గుర్తించే దిశగా నగరపాలక సంస్థ దృష్టి సారించింది. నగరపాలక సంస్థలో 2005 నుంచి ఖాళీ స్థలాల పన్ను చెల్లించకుండా ముఖం చాటేస్తున్న వారిని గుర్తించి పన్నులు రాబట్టే దిశగా అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశాల మేరకు కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ఈ మేరకు వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) బకాయిదారులను గుర్తించే పనిలో పడింది. కొద్ది నెలల క్రితం రూపొందించిన లెక్కల ప్రకారం 2005 నుంచి గడచిన 20 ఏళ్లుగా దాదాపు 4,400 మంది ఖాళీస్థలాల పన్ను చెల్లించకుండా ముఖం చాటేసినట్టు గుర్తించారు. అయితే స్థానికంగా స్థలాలు కొనుగోలు చేసి పక్క జిల్లాలు, పొరుగు రాష్ట్రాలు, విదేశాలలో స్థిరపడ్డ వీరందరినీ గుర్తించడం కష్టతరంగా మారింది. ఫలితంగా ఏటా రావలసిన బకాయిలు వస్తున్నప్పటికీ మొండి బకాయిల్లో మాత్రం కదలిక కనపడడం లేదు. దీంతో ఇటీవల సచివాలయాల వారీగా మొండిబకాయిల రికార్డులు ఆధారంగా సర్వే చేశారు. వీటిలో సుమారు 2,300 మంది నుంచి 19 కోట్ల రూపాయలు రావలసి ఉందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మిగిలిన ఖాళీస్థలాల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం, ఇతర అవసరాలకు వినియోగం చేసినట్టుగా నిర్ధారణకు వచ్చారు.

కార్యాచరణ ఇలా..

గుర్తించిన బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టే దిశగా కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఆయా సర్వే నెంబర్లు, పేర్ల ఆధారంగా రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయా స్థలాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయా? స్థల మార్పిడి జరిగిందా? ఇళ్లు నిర్మించారా? వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో కూడా ఖాళీ స్థలాలను గుర్తించే పనిలో పడ్డారు.

వసూళ్లపై దృష్టి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతుండడంతో పన్నులను రాబట్టే దిశగా దృష్టిపెట్టారు. గుర్తించిన బకాయిదారులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పన్నులు కట్టకపోతే సదరు ఖాళీ స్థలాల్లో నోటీసు బోర్డులు కూడా పెట్టనున్నారు. ఆ మేరకు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్లకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

పన్నులు చెల్లించండి



ఆస్తి పన్ను బకాయిలు ఉంటే భవన నిర్మాణాలకు అనుమతి రాదు. బకాయిలపై రెండు శాతం అపరాధ రుసుము కూడా పడుతుంది. తక్షణమే పన్ను వేయించుకుని చెల్లిస్తే పెరిగే భూమి విలువల ఆధారంగా కలిగే పన్ను భారం తగ్గుతుంది. ప్రజలు సహకరించి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

– మనోహర్, డిప్యూటీ కమిషనర్, కాకినాడ

పవర్ లిఫ్టర్ మందపల్లికి కలెక్టర్ అభినందన



పవర్ లిఫ్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఈనెల 18 నుంచి 22 వరకు దల్లి రాజహార్ ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ డిపో డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు బంగారు పతకాన్ని సాధించారు. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 750 మంది పాల్గొనగా కాకినాడ డిపో డ్రైవర్ శ్రీనివాసరావు ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని పొందడాన్ని కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. పవర్ లిఫ్టర్ శ్రీనివారావు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ భావన

- కమిషనర్ భావన
- పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీ

కాకినాడ: పారిశుధ్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ భావన స్పష్టం చేశారు. బుధవారం అశోక్‌నగర్, మధురానగర్, కరణంగారి జంక్షన్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య సేవలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన ప్రజారోగ్య విభాగంలో పనిచేసే సిబ్బంది విధి నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం చూపించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. డ్రైనేజీలలో మురుగు నీరు నిలచిపోకుండా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావు తదితరులు ఉన్నారు.

జీవనోపాధి మెరుగుపరిచేందుకు చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ భావన
- కార్యాచరణ అమలుపై సమీక్ష

కాకినాడ: పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజల జీవనోపాధి అవకాశాలను మెరుగుపర్చి నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, దీన్‌దయాళ్ జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ మార్గదర్శకాల ప్రకారం అన్ని పట్టణ ప్రాంతాల్లో ప్రతిపాదించిన సిటీ లైవ్‌లీవుడ్ యాక్షన్ ప్లాన్ అమలుపై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజల సామర్థ్యం, నైపుణ్యం ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించి తద్వారా ఆయా కుటుంబాల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం 'మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్' ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంఎస్ఎంఈ భాగస్వామ్యంతో రానున్న ఐదేళ్లకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రోత్సాహాన్ని ఇస్తామన్నారు. ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ సభ్యులు శరత్, టీపీఆర్వో శైలజ, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ప్రసాద్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఏజెన్సీకి వాహన సామర్థ్య తనిఖీలు

- రవాణా శాఖ కార్యాలయంలో నిలుపుదల
- నేటి నుంచి ఏటీఎస్ ద్వారా తనిఖీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రవాణా వాహనాలకు ఆ శాఖ కార్యాలయంలో నిర్వహించే సామర్థ్య పరీక్షలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పటి వరకూ ఎంవీఐల ఆధ్వర్యంలో తనిఖీలు చేసి ఫిట్‌నెస్ జారీ చేసేవారు. ఇక నుంచి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చామని ఆటోమేటెడ్ మెషిన్ ద్వారా(ఏటీసీ) ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేస్తారని ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో స్లాట్‌లు బుక్ చేసుకున్న వారందరికీ బుధవారం ఎఫ్‌సీలు నిర్వహించి ముగించారు. జిల్లా మొత్తానికి సేవలందించే బాధ్యతను ఒక ఏజెన్సీకు అందజేయడంతో కత్తిపూడి యూనిట్‌తో పాటు పెద్దాపురం యూనిట్‌కు సంబంధించి ఆయా మండలాల పరిధిలో ఉన్న వాహనాలు అన్నీ ఇక నుంచి కాకినాడ బీచ్ రోడ్డులో ప్రైవేట్ ఏజెన్సీ ఏర్పాటు చేసుకున్న ప్రాంతానికి రావాల్సి ఉంటుంది. ఇక నుంచి వాహనాలకు ఫిట్‌నెస్ కావాలంటే వ్యయప్రయాసలకు గురికావడంతో పాటు సమయం వృధా అవుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కత్తిపూడి పరిధిలో ఉన్న గిరిజన ప్రాంతాలు, పెద్దాపురం పరిధిలో మెట్ట గ్రామాల నుంచి కాకినాడ రావాలంటే దాదాపు 100 నుంచి 150 కిలోమీటర్లు రావాల్సి ఉంది.

ప్రభుత్వ ఆదేశాలతో నిలుపుదల



ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం వరకూ మ్యానువల్ విధానంలో వాహనాలు తనిఖీ చేసి ఫిట్‌నెస్‌లు జారీ చేశాం. ఇక నుంచి సేవలు నిలిచిపోతాయి. స్లాట్‌లు బుక్ చేసుకునేవారు వాహన యాప్‌లో ఏజెన్సీ స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. ఇక నుండి వాహన యాజమానులు ఈ విషయం గుర్తించాలి.

– కె.శ్రీధర్, డీటీసీ, కాకినాడ

అరాచకం ఆగేనా?

- కలెక్టర్ ఆదేశాలతో స్పందించిన డీపీఓ
- మారుతీనగర్‌లో నరికిన చెట్లు, గుడిసెల వద్ద క్షేత్రస్థాయి పరిశీలన

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ రూరల్: గేటెడ్ కమ్యూనిటీకి మార్గం కోసం తిమ్మాపురం గ్రామ పరిధిలోని మారుతీనగర్‌లో పేట కాల్వపై అనధికారిక వంతెన నిర్మాణంపై బుధవారం సాక్షిలో 'అరాచక బాట' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. గ్రామ జనసేన నాయకులు చెప్పడంతో తీవ్ర ఆందోళనలో ఉన్న బాధితులకు అండగా కథనం రావడంతో వాస్తవం తెలుసుకోవాలని కలెక్టరు షణ్మోహన్ ఆదేశాల మేరకు డీపీఓ రవికుమార్ బుధవారం ఉదయం మారుతీనగర్‌కు వచ్చారు. ఆయన వెంట ఈవో పీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు. మారుతీనగర్‌లో పేట కాల్వ వద్ద నరికి ఉన్న చెట్లను డీపీఓ పరిశీలించి, ఎన్ని నరికివేశారో లెక్క రాసుకున్నారు. అలాగే గుడిసెల్లోని కోట అరుణ, గేదెల గౌరమ్మ, చేబ్రోలు వరలక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దాదాపు 25 ఏళ్లుగా కాల్వ గట్టుపై గుడిసెల్లో నివసిస్తున్నామని వారు తెలియజేశారు. తమకు పట్టాలు ఇచ్చారని ఇళ్లు కట్టుకునే స్థోమత లేక కేటాయించిన స్థలాల వద్దకు వెళ్లలేదని తెలియజేశారు. పెద్దోళ్లకు మార్గం కోసం కాల్వపై వంతెన నిర్మించేందుకు తమను ఖాళీ చేయాలని జనసేన నాయకులు చెప్పారని డీపీఓకు వారు వివరించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన అనంతరం కలెక్టర్‌కు నివేదిస్తామని డీపీఓ విలేకరులకు తెలియజేశారు. అంతకు ముందు తహసీల్దార్ కుమారి ఆదేశాల మేరకు ఆర్ఐ భవాని, వీఆర్వో సత్యనారాయణ మారుతీనగర్‌ను సందర్శించి పేట కాల్వను పరిశీలించారు. గుడిసెల్లో ఉన్న వారితో మాట్లాడారు.



పేట కాల్వ వద్ద గుడిసెలు, నరికిన చెట్లను పరిశీలిస్తున్న డీపీఓ రవికుమార్ తదితరులు

ఆగమేఘాలపై అనుమతులకు యత్నాలు

గేటెడ్ కమ్యూనిటీ ఇళ్లు, అపార్టుమెంట్లకు రాజమార్గం కోసం బడాబాబులకు మద్దతుగా రంగంలోకి దిగిన జనసేన నాయకులు అనధికార వంతెన సాధ్యపడదని తెలిసి, అనుమతుల కోసం యత్నాలు ప్రారంభించింది. ఎప్పటి నుంచో నివాసాలు ఉంటున్న వారిని వేరే చోట గతంలో పట్టాలు ఇచారనే నెపంతో వంతెన నిర్మాణానికి అడ్డుగా ఉన్న మూడు గుడిసెల తొలగింపునకు రెవెన్యూ అధికారులుతో యత్నాలు ప్రారంభించారు. అధికారం ముందు పేదల బతుకులు పక్కకు తొలగాల్సిందేనా అని పలువురు చర్చించుకుంటున్నారు.

వారిది వైఫల్యం.. వీరిది కర్తవ్యం..!

- కూలిన రెయిలింగ్‌కు పోలీసుల భద్రత
- నిర్లక్ష్యం వహిస్తున్న ఆర్ అండ్ బి శాఖ
- నిర్వహణ నిధులు లేవంటూ పలాయన మంత్రం పఠిస్తున్న వైనం

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కూలిన రెయిలింగ్ ప్రదేశాల్లో పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో బ్రిడ్జిపై నాలుగు ప్రదేశాల్లో కూలిన రెయిలింగ్ వద్ద బైండింగ్ వైర్లతోను, రంగు రిబ్బన్లతో చేతనైనంతలో రక్షణ ఏర్పాటు చేశారు. వారు కట్టినవి వాహనాలో, పాదచారులో ఆదమరచి పడిపోతే ఆపలేవని తెలిసినా ప్రమాదం జరగకుండా నామమాత్రంగానైనా కర్తవ్య నిర్వహణ చేశారు. సామర్లకోట–పెద్దాపురం ఏడీబీ రోడ్డు వైపు కంటి ఆస్పత్రి ఎదురుగా, సత్యనారాయణపురం వెళ్లే మార్గంలో, రైల్వే ఆస్పత్రి వైపు, బార్ ఎదురుగా పలు వాహనాలు ఢీకొనడంతో ఫ్లై ఓవర్‌పై రెయిలింగ్ శిథిలమైంది. ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై నిత్యం అనేక మంది పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. వారి ఇబ్బందిని గమనించి పోలీసులు ఈ రక్షణ చర్యలు చేపట్టారు.



రెయిలింగ్ ధ్వంసమైన ప్రాంతంలో రిబ్బన్, బైండింగ్ వైర్‌తో రక్షణ ఏర్పాటు (అంతర చిత్రం) గోడ వద్ద బైండింగ్ వైర్ చుడుతున్న పోలీసులు

ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కూలిన రెయిలింగ్ ప్రదేశాలలో మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా మెయింటనెన్స్ నిధులు నిలిపి వేశారని తెలిపారు.

ఏఐవైఎఫ్ కార్యదర్శిగా బాబి

కాకినాడ సిటీ: కాకినాడ ఎస్‌టీయూ భవన్‌లో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా మహాసభ అఖిలభారత యువజన సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా యు.నాని బాబు, ఉపాధ్యక్షులుగా సీహెచ్ గీత, గోనెల నాగభూషణం, వి.లోవ, కార్యదర్శిగా వై.బాబి, సహాయ కార్యదర్శిగా రాజువర్ధన్, సహాయ కార్యదర్శులుగా నాని సూరంపూడి, మానెడ్డి వీరబాబు, కోశాధికారిగా పొన్నాడ దుర్గాప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, తోకల ప్రసాద్, టి.అన్నవరం, సత్యనారాయణ తదితరులు అభినందించారు.

ఔరా అనిపించిన పురులియా చౌ!



పురులియా చౌ సంప్రదాయంలో మహిషాసుర మర్దిని నృత్య రూపకం

- ఆహూతులను మైమరపించిన నృత్య రూపకం
- కళ్లకు కట్టిన మహిషాసుర మర్దిని, అభిమన్యు వధ ఘట్టాలు

పిఠాపురం: స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం పశ్చిమ బెంగాల్‌లో ప్రసిద్ధి చెందిన పురులియా చౌ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ నృత్యం ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. రూపకంలో పాత్రధారులు వారి హావభావాలతో ఔరా అనిపించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఈ సెమి క్లాసికల్ జానపద నృత్యం పరమ శివుని పూజించడానికి అనాదిగా వస్తున్న పూజా విధానాలు శాస్త్రాలు మంత్రాల నుంచి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. 2010లో యునెస్కో కనుమరుగవుతున్న సాంస్కృతిక వారసత్వ సంపద 'పురులియా చౌ' అని వారి జాబితాలో చేర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చౌ అనే పదం సంస్కృత పదం ఛాయ నుంచి వచ్చిందని ఛాయ అంటే సెమీ క్లాసికల్ జానపద నృత్యంగా వారు తెలిపారు. ఈ నృత్యంలో కళాకారులు అనేక వర్ణాలతో కూడిన దుస్తులు, మాస్కులతో అనేక విన్యాసాలు చేసి ప్రేక్షకులను తన్మయత్వానికి గురి చేసాయి. మొహూరి, షెహనాయ్ వంటి సంగీత వాయిద్యాలు, రకరకాల తాళ వాయిద్యాలతో డోలు, డ్రమ్స్, ఖర్క, మొదలైన తాళ వాయిద్యాలు సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశాయి. మహిషాసుర మర్దిని, అభిమన్యు వధ ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపారు. 98 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి ఖ్యాతి గడించిన ఈ నృత్య రూపకాన్ని వీక్షించిన ప్రేక్షకులు నటీనటులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మన ఊరు మన బాధ్యత సభ్యులు పాల్గొన్నారు.

స్థలం కబ్జాను అడ్డుకోండి

- జనసేన నేతపై ఓ కుటుంబం ఫిర్యాదు

కాకినాడ రూరల్: తమ భూమిని ఆక్రమిస్తున్నారని ఓ బాధిత కుటుంబం జనసేన నేతపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సర్పవరం పోస్టల్ కాలనీలో డోర్ నంబరు 6–125/23లో తమ అత్తగారు గొర్ల అప్పల నరసమ్మ 40 ఏళ్ళగా రేకుల షెడ్‌లో ఉంటున్నారని, రెండు నెలల క్రితం షెడ్ వెనక భాగంలో మరో గది నిర్మించుకునేందుకు శుభ్రం చేసుకుంటే ఆ స్థలం కబ్జా చేస్తున్నారని అప్పల నరసమ్మ కోడలు అమ్మాజీ, కొడుకు బాపూజీ ఆవేదన వ్యక్తం చేశారు. మీసాల సూరిబాబు అనే వ్యక్తి రెండు నెలల క్రితం రాత్రికి రాత్రే పాక వేసేందుకు ప్రయత్నించగా ప్రశ్నించడంతో గ్రామ జనసేన నాయకుడు పుల్ల శ్రీరాములు చెప్పడంతో వేశానని సమాధానం ఇచ్చినట్టు వారు తెలియజేశారు. దీనిపై అప్పట్లో ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆగారని, మళ్ళీ బుధవారం పాక వేసేందుకు పనులు చేపట్టారని దీనిపై జనసేన నాయకుడు పుల్ల శ్రీరాములును ఆయన ఇంటికి వెళ్లి అడగగా తన పట్ల దురుసుగా ప్రవర్తించారని, మహిళనని అని కూడా చూడకుండా ఏకవచనంతో దూషించి, రేకుల షెడ్‌ను కూడా పీకేస్తామని హెచ్చరించారన్నారు. తమకు జరిగిన అన్యాయంపై బుధవారం రాత్రి సర్పవరం పోలీసు స్టేషన్‌కు వచ్చి పుల్ల శ్రీరాములుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఏఎస్సై నాగేశ్వరరావును వివరణ కోరగా ఫిర్యాదుతో అమ్మాజీ, ఆమె భర్త వచ్చారన్నారు. విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



రేకుల షెడ్ వెనక ఖాళీ స్థలంలో నిర్మిస్తున్న పాక (అంతర చిత్రం) ఫిర్యాదు చేసిన అమ్మాజీ

హక్కులపై చైతన్యం కలిగించాలి

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- గిరిజన ప్రాంతాల కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

సామర్లకోట: గిరిజన ప్రాంతాల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై వారికి చైతన్యం కలిగించాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. ఈటీసీలో రెండు రోజుల పాటు నేర్చుకున్న అంశాలను గిరిజన ప్రాంతాల్లో అమలు చేయాలని ఆయన శ్రీకాకుళం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రెండు రోజుల పాటు వారికి నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం రాజ్యాంగంలో కొన్ని హక్కులను పొందుపరిచారన్నారు. ఆ హక్కులపై వారికి అవగాహన లేకపోవడం వలన వాటిని వినియోగించుకోలేక పోతున్నారన్నారు. కొంత మంది గిరిజనులు వారు పండిస్తున్న పంటలను దళారుల వలన మోసపోతున్నారని చెప్పారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండే విధంగా ప్రభుత్వం గిరిజన ప్రాంతాలలోని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు గిరిజనుల హక్కుల సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ వివిధ అంశాలపై ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు పి.శ్రీనివాస రావు, జి.శ్రీదేవి, వి.ప్రసాద్, కేఆర్ నిహారిక, డీఆర్ఎన్ పద్మజ, ఎస్‌కే మొహిద్దీన్ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

200 మందికి వైద్య పరీక్షలు

బోట్‌క్లబ్: సమాజ సేవలో తాము ఎప్పుడూ ముందుంటామని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు. లయన్స్ సంకల్ప్ ఆధ్వర్యంలో స్థానిక భానుగుడి సెంటర్‌లో బుధవారం మహిళలకు ఎముకలు, దంతాలు, సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూర్యగ్లోబల్ హాస్పిటల్ వైద్యులు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు బోన్ డెన్సిటీ, దంత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రీజనల్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ 1 చైర్మన్ పున్నమరాజు, మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి, లయన్స్‌క్లబ్ కో ఆర్డినేటర్ మెట్టా రాధ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.